స్కెచ్

# ఇంతలో ఉంది!

ద్రోణంరాజు కృష్ణమోహన్

వాడు ఎంతసేపటినుంచో అలా పడి పొర్లాడుతున్నాడు రోడ్డుప్రక్కన చెట్టుక్రింద. పాపం మూర్ఛరోగి కాబోలు! నోటివెంట నురగలు కక్కుతున్నాడు. చేతులు కాళ్ళు కొట్టుతున్నాడు నేలకేసి మెలికలు తిరుగుతూ. ప్రజాసమూహం పోగయింది. పనివున్నవాళ్ళు, లేనివాళ్లు అందరూ ఏకాగ్రదృష్టితో అతిశ్రద్ధగా వాడివైపు చూస్తున్నారు. వాళ్ళతో పోటీగా నేనూ చూస్తున్నాను. పదినిముషాలకి ఎవరో ఒక సోడాకొట్టు యజమాని దయతలచి కాసిని నీళ్ళు వాడి మొహాన దిమ్మరించాడు. కాసేపట్లో వాడు తేరుకున్నాడు. మాసిన గెడ్డం, చినుగుల బట్టలు, పెరిగిన క్రాఫింగు, మెడలో మార్చరోగాన్ని తెలియజేసే బిళ్ళ. ఆవతారం చూస్తే జాలివేసింది. వాడి బాధను చూస్తే హృదయం ద్రవించింది. అందరికీ అలాగే అనిపించింది. కాని ఒక్కరూ ముందుకు రారు. (నేను కూడా వాళ్ళల్లో జమే లెండి!) ఎవరో ధర్మాత్ములు ఒకరిద్దరు కానీ అర్ధణా పారేశారు.

ఇంతలోకే బస్సువచ్చింది. అందరితో పోటీ నేనూ, చొక్కా లాగూ చింపుకున్నంత పనిచేసి లోపలకి దూరి ఒకమూల చతికిలపడ్డాను. బస్సు కదిలింది. నలుగురూ నాలుగు రకాలుగా వాడిని గురించి చర్చించుకుంటున్నారు.

"వాడు ఒట్టి దొంగవెధవ." ప్రబుద్ధుడొకడు వ్యాఖ్యానించాడు.

"ఇదొక వేషం, డబ్బుకాజెయ్యడానికి." మరో దీవెన!

"దున్నపోతులా వున్నాడు." ఎంత సరిగా చెప్పాడు మరో పెద్దమనిషి!

"ఏదో వాడిబతుకు వాడు బ్రతుకుతున్నాడు" పుణ్యాత్ముడొకడు సమర్థించాడు.

వాడినిగురించి ఆలోచనలు దొర్లసాగాయి. వాడు నిజంగా ఎంత దౌర్భాగ్యుడు! వాడికేగనుక డబ్బు వుండివుంటే! వాడేగనుక విలువైన వేషం ధరిస్తే? ఖర్మంచాలక రోడ్డుమీద తూలిపడితే! ఎంత ఆప్యాయత! ఎంత ఆదరణ! కారులో తీసుకు పోయేవారొకరు, బండి మాట్లాడి యింటికి తీసుకెళ్ళేవారొకరు, యిలాగే తలోరకంగా ప్రయత్నించేవారు. కాని వీడిపట్ల నోటి సానుభూతే గాని, ఆచరణలో ఏమీలేదు. దారినపోయే జనానికి పట్టదు. పోలీసులుగాని ఆరోగ్యశాఖవారుగాని ఆ చాయలకు రారు. కంటికి ఆ దృశ్యం కనబడితే తక్షణం మరో పక్కకి తప్పుకుంటారు. డబ్బువున్నా లేకపోయినా, తిన్నా తినకపోయినా, ఖరీదైన దుస్తులుధరించి, చేతికి గడియారం జేబులో పౌంటెన్ పెన్ వుంచుకుంటే, వెంటనే ఎంత గౌరవం చూపిస్తారు! అన్ని వర్గాల ప్రజలూ కావలసినంత సానుభూతి ఒలకపోస్తారు.

వాడిని గురించి, లోకం తీరు గురించి, యింకా ఏదో ఆలోచిస్తున్నాను. బస్సు వేగంతో పోతోంది. చీకటి పడేవేళ చల్లనిగాలి అందమైన తోటలుగల దివ్యమైన భగవంతుల మధ్య విశాలమైన రోడ్డుమీద బస్సు చడీచప్పుడు లేకుండా చాలా మెత్తగా సాగిపోతోంది... బ్రేక్ ...సడెన్ బ్రేక్ తపీమని ఆగిపోయింది బస్సు. అందరం ముందుకు వెనక్కి గ్రుద్దుకున్నాం. ఆత్రుత ఎక్కువైంది. ఏదయినా ప్రమాదం జరిగిందేమో, ఎవరయినా పరలోకం పయనమవడానికి సిద్ధపడుతున్నారేమోననుకున్నాను. అందరితోపాటే లేచి దిగాను.

ఒక యువకుడు పాలికేట్లుంటాయి. బస్సు స్టాపింగు దగ్గరవున్న తూముప్రక్కన పడివున్నాడు. మనిషి అందంగా వున్నాడు. మంచిబట్టలు ధరించాడు. వాచి, పెన్ను, చేతిలో ఏవో పత్రికలు వున్నాయి.

"లేవదియ్యండి ... లేవదియ్యండి" కేకలు: అంతా కలిసి హడావిడిగా లోపలికి తీసుకొచ్చారు.

ఒక బెర్త్ పూర్తిగా ఖాళీ చేశారు. లేచి నిలబడవలసి వచ్చిన వారిలో నేను కూడా వున్నాను. ఒకరు పరుగెత్తికెళ్ళి దగ్గరలోవున్న యింట్లోంచి నీళ్ళు తెచ్చి చల్లారు. బస్సు మళుపు తిరిగింది. సోడా కొట్టుదగ్గిర ప్రత్యేకం ఆగింది. సోడా తెచ్చి యిచ్చారు. ఆ యువకుడు కళ్ళు తెరిచి నెమ్మదిగా దిగాడు. బస్సు మళ్ళీ కదిలింది.

"ఎలా వుంది?" ఒకరి ప్రశ్న.

"ఫరవాలేదు, కృతజ్ఞుడిని', చాలా గౌరవంగా రెండు చేతులు జోడించాడు.

"అబ్బెబ్బే ఎంత మాట. మా ధర్మం అది!" వయస్సు మళ్ళిన అరవై ఏళ్ళ పెద్దమనిషి వ్యాఖ్యానించాడు. సేవాసక్తి, మానవ ధర్మం, నీతి, న్యాయం ఇత్యాదుల గురించి పలువురు తమకు తోచినవి చెప్పారు.

"ఎక్కడ పని చేస్తున్నారు?" ఇంకొకాయన అడిగాడు.

"ఇంకా లేదు. అందుకోసమే యీ వూరు వచ్చాను. స్నేహితుడి గదిలో వుంటున్నాను" ముక్తసరిగా చెప్పాడు. పేరు, ఎడ్రసు, వివరాలు తెలివిగా తప్పించాడు చెప్పకుండా. ఎవరూ గట్టిగా పట్టుపట్టలేదు.

"ఇది మూర్ఛ కాదనుకుంటాను" అంటే ఎక్కడ చిక్కువస్తుందో నన్న భయంతో గాబోలు ప్రారంభించాడు బట్టతల బాపయ్య.

"ఎబ్బె, కాదండి. నాకు యీ మధ్య వంట్లో మరీ నీరసంగా వుంటోంది. రోడ్డుమీద నడుస్తూ అప్పుడప్పుడు తూలిపడిపోతూ వుంటాను. కళ్ళు తిరుగుతూ వుంటాయి. ఏమిటో విచిత్రమైన వ్యాధి" తినకే తెలియదన్నట్లుగా చెప్పాడు.

"మందు పుచ్చుకోండి" హోమియో ప్రాక్టీషనరు గాబోలు (బోర్డుకట్టి వుండడు) ఏదో పేరు చెప్పాడు.

"ఆయుర్వేదం చాలా ప్రాచీనమైనది. దేశదేశాల ఖ్యాతిగాంచింది" ముక్కుపొడుం తేలికగా పీలుస్తూ మరో వైద్యరాజ్ తనకు తోచిన లేహ్యాదులు సూచించాడు.

"ఎవరెన్ని చెప్పినా అల్లోపతిని బీటవుట్ చేసేది మరొకటి లేదండి" మరో నాటువైద్యుడు(కనీసం నాలుగు మందుల పేర్లన్నా వినివుండని వాడు) సలహా యిచ్చాడు ఏదో టానిక్.

ఆ యువకుడు దిగవలసిన చోటు వస్తున్నది గాబోలు. జేబులు తడుముకుంటున్నాడు ఎందుకో లేచి.

"ఏం ఏదన్నా పారేసుకున్నారా అక్కడ?" ఒకరు అడిగారు అతిశ్రద్ధగా.

"పర్సే. చాలా ముఖ్యమైంది."

"ఏమిటది?" ఖంగారుగా అడిగాడు ఇంకో ఆయన.

"అదే, పర్సు."

"ఏమాత్రం వుండింది?" ఒక పెద్దమనిషి తన గుండె ఆగిపోయినంత పని అయి అడిగాడు.

"పదిరూపాయల నోట్లు అన్నీ అలమారాలోనే పెట్టాలెండి! పర్సులో రెండురూపాయల చిల్లర వుండాలి. ఈపూట భోజనానికని వుంచుకున్నాను." తలవంచుకు అన్నాడు తడబడుతూ ఒకరిద్దరుమాత్రం ఎందుకో అతనివైపు అనుమానంగా చూశారు.

"ఓస్. ఇంతేగదా!" అని ఒకాయన జేబులోంచి రూపాయి నోటు తీసి యివ్వబోయాడు. మరో యిద్దరు జేబుల్లో చేతులు పెట్టబోయి ఆపుకున్నారు అవతలాయన యివ్వడం చూసి.

"ఎబ్బెబ్బే, నా కొందుకండీ! మళ్ళీ వెనక్కి వెళ్ళి డబ్బు తెచ్చుకుంటాను రూమ్ దగ్గిర్నుంచి."

"ఫరవాలేదు. పుచ్చుకోండి. మళ్ళీ ఏం వెడతారు వెనక్కి? హాయిగా భోంచేసి, విశ్రాంతి తీసుకుని, మీ పని చూసుకుని, తిరిగి వెళ్ళండి బస్సులో" బలవంతం చేశాడు ఆ వ్యక్తి. పక్కన కూర్చున్న యిద్దరు ముగ్గురు కూడా అలాగే అన్నారు. తీసుకోక తప్పలేదు.

* * *

నాలుగు రోజుల అనంతరం ఆ యువకుడు ఆ మహానగరంలో మరో పేటలో అదే స్థితిలో పడి వుండటం, అదే విధంగా సత్కారం, గౌరవం, యివ్వడం స్వయంగా చూసిన నాకు అతనికిగల వ్యాధి ఏమిటో అర్థమైంది.